సాక్షి ఒడిశా

సోమవారం, 25, మార్చి, 2024



శ్రీమందిర ఆదాయం

నగదు	రూ.3,59,924	
బంగారం	850 మిల్లీగ్రాములు	
వెండి	8 గ్రాములు	- భువనేశ్వర్/పూరీ



సారాబట్టీలపై దాడులు

గంజాం జిల్లా అస్కాలో వంటసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టారు. భారీగా సారా, బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

- 8లో



న్యూస్‌రీల్

అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

జయపురం: తెలుగు సినీ నటుడు గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా జయపురం రామచరణ్ యువత ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక బ్లడ్ బ్యాంక్‌లో చిరంజీవి కల్చరల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.శ్రీనివాస ఖన్నా ఈ శిబిరాన్ని ప్రారంభించారు. టెక్నీషియన్ లభయ పండా నేతృత్వంలో సిబ్బంది రక్తదాతల నుంచి బ్లడ్ సేకరించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రామచరణ్ యువత అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి కె.రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

కలప లారీలు స్వాధీనం



కలప దుంగలతో పట్టుబడిన లారీలు

రాయగడ: జిల్లాలోని గుడారి అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా కలప రవాణా చేస్తున్న మూడు లారీలను గుణుపూర్ అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. గుడారి అటవీ రేంజర్ గంగాధర్ మిశ్రో, సిబ్బంది శనివారం గుమడ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో లారీలను అనుమానించి తనిఖీ చేయగా కలప దుంగలు బయటపడ్డాయి. కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు.

కాశీపూర్‌లో అబ్కారీ దాడులు



స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అబ్కారీ పోలీసులు ఆదివారం నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. జమ్ముగుడ ప్రాంతంలో 140 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. మరో 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గత కొద్ది రోజులుగా పోలీసులు నాటుసారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపుతున్నారు.

బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల జాబితా ప్రకటన

భువనేశ్వర్: రాష్ట్రంలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి భారతీయ జనతా పార్టీ తన అభ్యర్థుల తొలి జాబితాను ఆదివారం విడుదల చేసింది. మొత్తం 21 లోక్‌సభ స్థానాలకు గాను 18 చోట్ల అభ్యర్థులను ఖరారు చేసింది. కటక్, జాజ్‌పూర్, కంధమాల్ జిల్లాల్లో అభ్యర్థులను రెండో జాబితాలో ప్రకటించనుంది.

అభ్యర్థులు వీరే..

నియోజకవర్గం	అభ్యర్థి
బరగఢ్	ప్రదీప్ పురోహిత్
సుందర్‌గఢ్(ఎస్టీ)	జుయేల్ ఓరామ్
సంబల్‌పూర్	ధర్మేంద్ర ప్రధాన్
కెంజొహార్(ఎస్టీ)	అనంత నాయక్
మయూర్‌భంజ్(ఎస్టీ)	నవచరణ్ మాఝి
బాలాసోర్	ప్రతాప్‌చంద్ర సారంగి
భద్రక్(ఎస్సీ)	అభిమన్యు శెట్టి
ఢెంకనాల్	రుద్రనారాయణ పాణి
బొలంగీర్	సంగీత కుమారి సింగ్‌దేవ్
కలహండీ	మాళవిక కేసరీ దేవ్
నబరంగపూర్(ఎస్టీ)	బలభద్ర మఝి
కేంద్రపడా	బైజయంత్ జైపండా
జగత్సింగ్‌పూర్(ఎస్సీ)	బిభూ ప్రసాద్ తారై
పూరీ	డాక్టర్ సంబిత్ పాత్రా
భువనేశ్వర్	అపరాజిత షడంగి
అస్కా	అనితా శుభదర్శిని
బరంపురం	ప్రదీప్‌కుమార్ పాణిగ్రహి
కొరాపుట్(ఎస్టీ)	కాళీరామ్ మాఝి

లోక్‌సభ స్థానాల్లో.. కొత్త ముఖాలు!

- అభ్యర్థుల ఎంపికను వేగవంతం చేసిన బీజేడీ
- సీనియర్ నాయకులతో సమావేశమైన సీఎం నవీన్



భువనేశ్వర్: ఒడిశాలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకు ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్న అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) జంట ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. బీజేడీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నివాసమైన నవీన్ నివాస్‌లో ఆదివారం పార్టీ సీనియర్ నాయకులు సమావేశమయ్యారు. ఎన్నికల సన్నాహాలతో పాటు వివిధ లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికపై చర్చించారు.

- అభ్యర్థులను ఖరారు చేయడమే కాకుండాఎన్నికల వ్యూహానికి అధికార పార్టీ తుది మెరుగులు దిద్దుతోంది. పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ ఇప్పటివరకు 11 లోక్‌సభ, 77 అసెంబ్లీ స్థానాలకు ప్రతిపాదిత, ఔత్సాహిక అభ్యర్థుల గెలుపు అవకాశాల్ని సమీక్షించారు. ఇప్పటికే కొందరు నేతలు ఎన్నికల పోరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. స్పష్టమైన సూచనలను పొందిన తరువాత, అనేక మంది పోల్ యోధులు ఇప్పటికే రణరంగంలోకి దిగారు.

వీరికి ఖరారైనట్లే..!

- అధికార బీజేడీ పూరీకి అరూప్ పట్నాయక్, బరంపురం లోక్‌సభ స్థానాలకు చంద్రశేఖర్ సాహు పేర్లను ఖరారు చేసినట్లు సమాచారం. పార్టీ సిట్టింగ్ ఎంపీ పినాకి మిశ్రా ఈసారి పూరీ నుంచి పోటీ చేసే అవకాశం లేదు.
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో భువనేశ్వర్ నుంచి ఓడిపోయిన ముంబై మాజీ పోలీస్ కమిషనర్ అరూప్ పట్నాయక్ ఈసారి పూరీ నుంచి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. గత ఎన్నికల్లో భువనేశ్వర్‌లో బీజేపీకి చెందిన అపరాజిత షడంగి 23,000 ఓట్ల తేడాతో పట్నాయక్‌పై విజయం సాధించారు.
- బరంపురం లోక్‌సభ నియోజకవర్గంలో, ప్రాంతీయ పార్టీ ఇప్పటికే ఆ ప్రాంతంలో ప్రచారం ప్రారంభించిన చంద్రశేఖర్ సాహును తిరిగి నామినేట్ చేసే అవకాశం ఉంది. చంద్రశేఖర్ సాహు 2019 ఎన్నికలలో దాదాపు 94,000 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి భృగు బక్షిపాత్రోను ఓడించారు. అదేవిధంగా, పార్టీ సిట్టింగ్ లోక్‌సభ సభ్యుడు డాక్టర్ అచ్యుత సామంతను కంధమల్ పార్లమెంట్ స్థానానికి తిరిగి నామినేట్ చేసే అవకాశం ఉంది.
- భర్తృహరి మహతాబ్ బీజేడీని వీడి బీజేపీలో చేరిన తర్వాత, ప్రాంతీయ పార్టీ కటక్ లోక్‌సభ స్థానానికి కొత్త ముఖం కోసం వెతుకుతోంది. ప్రతిపాదిత నామినీలలో కార్పొరేట్ ప్రపంచాన్ని విడిచిపెట్టి రాజకీయాల్లోకి ఇటీవల అడుగు పెట్టిన సంతృప్త్ మిశ్రా ముందంజలో కొనసాగుతున్నారు.
- 2021లో కాంగ్రెస్‌ను వీడి అధికార బీజేడీ పార్టీలో చేరిన ప్రదీప్ మాఝిని రమేష్ మాఝి స్థానంలో నవరంగపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీకి దింపవచ్చని సంకేతాలు లభిస్తున్నాయి.
- ఇటీవలే కాంగ్రెస్‌ను వీడి బీజేడీలో చేరిన మాజీ ఎమ్మెల్యే అన్షుమన్ మహంతిని కేంద్రాపడాలో శంఖం పార్టీ బరిలోకి దించే అవకాశం ఉంది. రాజకీయవేత్తగా మారిన నటుడు అనుభవ్ మహంతి కుటుంబ వివాదంలో చిక్కుకున్న తరువాత బీజేడీ అధిష్టానం తన పట్ల శీతకన్ను వేసింది.
- భువనేశ్వర్ లోక్‌సభ సీటు రేసులో శ్రీమయీ మిశ్రా, బొలంగీర్‌లో కలికేష్ నారాయణ్ సింగ్ దేవ్‌ని బరిలోకి దింపడం దాదాపు ఖాయమైనట్లు సమాచారం. ప్రాంతీయ పార్టీ కెంజొహార్‌లో చంద్రాణి ముర్ము, అస్కా నియోజకవర్గాల్లో ప్రమీలా బిషోయ్ బదులుగా కొత్త ముఖాలకు అవకాశం కల్పించవచ్చు.

విస్తృత చర్చలు..

బీజేపీతో పొత్తు చర్చలు నిర్వీర్యం కావడంతో బీజేడీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వేగం పుంజుకుంది. ఆదివారం నవీన్ నివాస్‌లో 4 లోక్‌సభ, 28 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపికపై చర్చ జరిగింది. సంబల్‌పూర్, సుందర్‌గఢ్, ఢెంకనాల్, జగత్‌సింగ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గాల నుంచి సీనియర్ నేతలు సమావేశానికి హాజరయ్యారు. కసరత్తులో భాగంగా బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్, పార్టీ ఎన్నికల వ్యూహకర్త వి.కార్తికేయ పాండియన్ ఈ నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, పరిశీలకులు, ఇతర పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. తొలుత సంబల్‌పూర్ పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థులపై చర్చ జరిగింది. ఆ ప్రాంత సీనియర్ నాయకులు, నియోజకవర్గ పరిశీలకులు, బీజేడీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్‌దాస్, బొంబై మాజీ ఎమ్మెల్యే భీంసేన్ చౌదరి పాల్గొన్నారు. ఛెండీపాదా ఎమ్మెల్యే సుశాంత్ బెహెరా, సుందర్‌గఢ్ మాజీ ఎమ్మెల్యే జోగేష్ సింగ్, పార్టీ సీనియర్ నేత మంగళ కిసాన్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. 2019 ఎన్నికల్లో పూరీ, కటక్ మినహా అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేడీ కొత్త ముఖాలను పోటీకి దింపడం గమనార్హం. ఏప్రిల్ మొదటి వారంలోగా పార్టీ తన అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. కాగా, 147 మంది సభ్యుల ఒడిశా అసెంబ్లీకి మే 13, మే 20, మే 25, జూన్ 1 తేదీల్లో నాలుగు దశల్లో ఓటింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతుంది. ఈ రోజుల్లో 21 లోక్‌సభ స్థానాలకు కూడా ఏకకాలంలో పోలింగ్ జరుగుతుంది. 2019లో ఎన్నికైన ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం ఈ ఏడాది జూన్‌లో ముగుస్తుంది,

బీజేడీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రమేష్, ఎమ్మెల్యే సదాశివ ప్రదాని



హాజరైన బీజేడీ నాయకులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో అధికార బిజూ జనతా దల్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి పార్టీ జిల్లా అధ్యక్షుడి హోదాలో ప్రారంభించారు. భవనం ప్రధాన మార్గాన్ని ఎంపీ రిబ్బన్ కత్తిరించగా, సమావేశ మందిరాన్ని పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రమోద్ రథ్ ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తల సౌకర్యార్థం భవనం అందుబాటు లోకి తెచ్చామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే కార్యకర్తలకు వసతి సౌకర్యం ఉంటుందన్నారు. హోలి పండగ అనంతరం కార్యకర్తలకు పూర్తిస్థాయి పనులు కేటాయింపు జరుగుతుందని చెప్పారు. ఎమ్మెల్యే సదాశివ ప్రదాని మాట్లాడుతూ మెయిన్ రోడ్డును ఆనుకుని భవనం ఉండటం వల్ల ప్రజా సమస్యలు కూడా ఇక్కడే పరిష్కరిస్తామన్నారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దామోదర్ రౌత్ సంతాప సభ నిర్వహించారు. పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కౌసల్య ప్రదాని, జిల్లా మహిళా బీజేడీ అధ్యక్షురాలు మంజులా మజ్జి, సీనియర్ నాయకులు రవి పట్నాయక్, తపస్ త్రిపాఠి, భీమొ హరిజన్, ఆశిష్ రంజన్ పట్నాయక్, సునీల్ సాహు, జిల్లా పరిషత్ సభ్యులు, సమితి ఛైర్మన్లు, వార్డు సభ్యులు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే విక్రం పండా తదితరులు

బరంపురం: ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు పిలుపునిచ్చారు. స్థానిక కలాసి వీధి ప్రాంగణంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సమయంలో సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఇలాంటి వారికి ఆదుకునేలా స్వచ్ఛంద సంస్థలు విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మహాత్మా హెల్పింగ్ క్లబ్, ఎన్‌టీఆర్ సేవా సమితి, ఆహోపా, ఎంకేసీజీ మెడికల్ హెల్త్ క్యాంప్, వాసవీ తదితర సంఘాల ప్రతినిధులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీఎంసీ డిప్యూటీ మేయర్ వివేక్ రెడ్డి, కార్పొరేటర్లు టి.మురళీమోహన్, టి.కిశోర్ పాత్రో, బుట్టు బెహరా, క్లబ్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి బి.వెంకటరావు, ప్రాజెక్ట్ ఛైర్మన్ ఎ.లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని అరికడదాం



అవగాహన కల్పించిన క్లబ్ సభ్యులు

రాయగడ: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా రాయగడలోని సాయిప్రియ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదిస్తే ఆరు నెలల్లో వ్యాధి నయమవుతుందన్నారు. వ్యాధిపై భయం చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం రాయగడ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సలహాదారులు దేవరాజ్ పండా, కార్యదర్శి కె.సూర్యనారాయణ శర్మ, కోశాధికారి టి.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

ఓజేయూ బలోపేతానికి కృషి

జయపురం: ఒడిశా జర్నలిస్ట్స్ యూనియన్(ఓజేయూ) కొరాపుట్ జిల్లా శాఖ ఆదివారం బంధు మిలన్ కార్యక్రమం నిర్వహించారు. ఒడిశా-ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు కొరాపుట్ జిల్లా సుంకి డాక్ బంగ్లాలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓజేయూ రాష్ట్ర కమిటీ సాధారణ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జయసింగ్ పాడిశెట్టి, ఉపాధ్యక్షులు శ్యామ ఖిలో, కార్యవర్గ సభ్యులు సునామ్ హంతాల్, రూప ఖోర, విక్రాంత బెహరా తదితరులు పాల్గొన్నారు.

కొట్‌పాడ్ జాక్‌పాట్ ఎవరికో..?

- బీజేడీ టికెట్ కోసం పోటీపడుతున్న పద్మిణీ, చంద్రశేఖర్



పద్మిణీ దియాన్



చంద్రశేఖర మఝి

2024 సార్వత్రిక సమరం

జయపురం: అధికార బీజేడీ తరపున పోటీ చేసేందుకు ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఎలాగైనా టికెట్ పొందేందుకు పైరవీ ప్రారంభించారు. జయపురం సబ్ డివిజన్‌లో ఎస్టీలకు కేటాయించి కొట్‌పాడ్ నియోజకవర్గంలో అధికార బీజేడీ తరపున టికెట్ పొందేందుకు సిటింగ్ ఎమ్మెల్యే పద్మిణీ ధియాన్, మాజీ ఎమ్మెల్యే, జిల్లా స్వతంత్ర పరిషత్ అధ్యక్షుడు చంద్రశేఖర మఝి పోటీపడుతున్నారు. 2019 ఎన్నికల్లో బీజేడీ తరపున పోటీలోకి దిగిన పద్మిణీ దియాన్ అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర మఝిపై 2631 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. సీఎం నవీన్ పట్నాయక్ మంత్రి మండలిలో కొలువు సాధించారు. కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న కొట్‌పాడ్‌లో ఆమె విజయం సాధించడం వల్లే ఆమెను మంత్రి పదవి వరించినట్లు పరిశీలకులు చెబుతారు. 2014లో కాంగ్రెస్ అభ్యర్థి పోటీ చేసి 31,321 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించిన చంద్రశేఖర మఝి.. 2019లో కేవలం 2631 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేడీలో చేరిపోయారు. 2024 ఎన్నికల్లో బీజేడీ తరపున టికెట్ ఇస్తామనే హామీ ఉండటం వల్లే పార్టీలో చేరినట్లు కొందరి మాట. తన మాదిరిగానే కాంగ్రెస్‌ను వీడి బీజేడీలో చేరిన మాజీ ఎంపీ ప్రదీప్ మఝిఎంపీ టికెట్ ఇస్తారని, ఈసారి సిటింగ్ ఎంపీ రమేష్ మఝి మొండిచెయ్యి తప్పదనే ప్రచారం జరుగుతోంది. అయితే సిటింగ్ ఎమ్మెల్యే అయిన తనకే కచ్చితంగా టికెట్ వస్తుందని పద్మిణీ దియాన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. వీరిద్దరిలో టికెట్ ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

మయూర్‌భంజ్ నుంచి రాష్ట్రపతి కుమార్తె!

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్రంలో రాబోయే ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. ఏ క్షణంలోనైనా జాబితా వెలువడుతుందని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో పలు ఆసక్తికర ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. మయూర్‌భంజ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ ఈసారి తన అభ్యర్థిని మార్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న బిశ్వేశ్వర్ టుడుని బీజేపీ ఈసారి బరిలోకి దింపే అవకాశం లేనట్లు సమాచారం. మళ్లీ నామినేట్ చేసే అవకాశం లేదు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచి బీజేపీ తరపున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కుమార్తె ఇతిశ్రీ ముర్ము పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గిరిజనులు అధికంగా ఉండే ఈ నియోజకవర్గం నుంచి 35 ఏళ్ల ఇతిశ్రీని పోటీకి దింపాలని పార్టీ అగ్రనాయకత్వం యోచిస్తోందని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. సీనియర్ నేతలు ఈ విషయమై గుంభనం ప్రదర్శిస్తున్నారు. ఇతిశ్రీ తన తల్లి ద్రౌపది ముర్ము అత్యున్నత పదవిని చేపట్టినప్పటి నుంచి తరచూ ఒడిశా పర్యటనలు చేస్తున్నారు. తల్లి పరపతి, పలుకుబడి కుమార్తె అభ్యర్థిత్వానికి పట్టం గట్టే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఎన్నికల పోరులో ఇతిశ్రీ ఆరంగేట్రం చేయడం రాష్ట్రంలోని బీజేపీ నేతలు, కార్యకర్తలతో పాటు ఓటర్లకు ప్రత్యేక సందేశం ఇస్తుందని భావిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో గిరిజన వర్గం ఓటర్లు 22 శాతానికి పైబడి ఉన్నారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తర్వాత ఒడిశాలో గిరిజనుల జనాభా అధికంగా ఉంది. ద్రౌపది ముర్ముకు సర్వోన్నత రాష్ట్రపతి పట్టం గట్టడం ద్వారా గిరిజనుల సాధికారత పట్ల బీజేపీ ఇప్పటికే తన నిబద్ధతను ప్రదర్శించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బిశ్వేశ్వర్ టుడు 25,256 ఓట్ల ఆధిక్యతతో బిజూ జనతా దళ్ (బీజేడీ) అభ్యర్థి దేబాషిస్ మరాండిపై విజయం సాధించిన సంగతి తెలిసిందే.

హోలీ సందడి

- హెర్బల్ రంగులకు గిరాకీ
- ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని పోలీసుల సూచన
- రాజధానిలో భద్రత కట్టుదిట్టం



వివిధ రంగుల ప్యాకెట్లు



హోలీ సామగ్రి



హెర్బల్ రంగులు

రాయగడ/భువనేశ్వర్: హోలీ సందర్భంగా రాయగడ మార్కెట్ సందడిగా మారింది. ఈసారి హెర్బల్ రంగుల వాడకంపై ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నారు. తక్కువ ధరకు లభించే ఈ రంగులు వినియోగించినా ఎటువంటి దుష్పరిణామాలు చోటు చేసుకోవని వైద్యుల చెబుతున్నారు. దీంతో హెర్బల్ రంగులకు గిరాకీ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

పోలీసులు భద్రతా కట్టుదిట్టం

హోలీ సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా భువనేశ్వర్, కటక్ జంట నగరాల కమిషనరేట్ పోలీసులు భద్రత కట్టుదిట్టం చేసినట్లు భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్ సింగ్ ఆదివారం ప్రకటించారు. నగరమంతా 15 ప్లటూన్ల బలగాలను మోహరిస్తున్నట్లు చెప్పారు. అదనంగా, భువనేశ్వర్‌లోని వివిధ ప్రదేశాలలో 31 స్టాటిక్ పోస్ట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో అవాంఛనీయ ఘటనల నివారణకు పీసీఆర్ వ్యాన్‌లు, 17 పెట్రోలింగ్ వాహనాలను మోహరిస్తున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ నిఘా, సమన్వయం కోసం అదనపు బలగాలతో పటిష్టం చేసినట్లు సింగ్ చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా ముమ్మరం చేస్తామని, అవాంఛనీయ ఘటనలు జరిగితే తక్షణమే చర్యలు తీసుకుంటామని ప్రతీక్ సింగ్ వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున హోటళ్లు, ఇతర ప్రదేశాలలో పార్టీలు నిర్వహించడానికి ప్రత్యేక అనుమతి అవసరమని చెప్పారు. పార్టీలు, ఇతర కార్యక్రమాల నిర్వాహకులు, అతిథులు, లౌడ్ స్పీకర్ల వినియోగానికి సంబంధించి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. కల్తీ రంగుల విక్రయాలను అరికట్టేందుకు దుకాణాలను తనిఖీ చేసేందుకు కమిషనరేట్ పోలీసులు డీఎస్పీ హోదా అధికారి, కాలుష్య నియంత్రణ మండలి నిపుణుల నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు.



వేడుకలకు సిద్ధమైన పిడకలు

క్లుప్తంగా

పోలీసులకు చిక్కిన నేరస్తుడు


రాహుల్ నాయక్‌తో పోలీసులు

బరంపురం: గంజాం, భంజనగర్ జిల్లాల పరిధిలో కొంతకాలంగా పోలీసుల కళ్లుకప్పి తప్పించుకు తిరుగుతున్న కరుడుగట్టిన నేరస్తుడు రాహుల్ నాయక్‌ని భంజనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి చిత్రరంజన్ బెహరా అందించిన సమాచారం ప్రకారం శనివారం అర్ధరాత్రి బుగడా హింజిలికాట్ బ్లాక్ పరిధి చైతన్యపడా గ్రామం వద్ద జాతీయ రహదారిలో పోలీసు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో రాహుల్ నాయక్‌ను గుర్తించి అరెస్టు చేశారు. ఇతని వద్ద నుంచి తుపాకీ, కత్తి, బులెట్లు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. రాహుల్ నాయక్‌పై గంజాం పోలీసు జిల్లా పరిధిలో వివిధ పోలీసు స్టేషన్‌లలో పదుల సంఖ్యలో కేసులు ఉన్నట్లు ఐఐసీ అధికారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


చికిత్స అందిస్తుండగా మృతిచెందిన దేబాశీష్

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి గంగళ గ్రామం ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. చౌలమాండి గ్రామానికి చెందిన దేబాశీస్ మతం (23) బైక్‌పై గంగ్ల గ్రామంలోని మేనమామ ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మల్కన్‌గిరి నుంచి జయపురం వైపు వెళ్తున్న టిప్పర్ బలంగా ఢీకొట్టింది. దేబాశీష్ తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు వెంటనే ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. మత్తిలి పోలీసులు కేసు నమోదు చేశారు. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

ఎన్‌టీఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్


ఎన్‌టీఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలో ఆదివారం వేకువజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. టెక్కలి సీఐ పి.పైడయ్య ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ కాలనీలోని పలువీధుల్లో తనిఖీలు నిర్వహించారు. వీధుల్లో అక్రమ మద్యం, సారా వంటి నిల్వలు ఉన్నాయో లేవో పరిశీలించారు. అనంతరం వీధిలో ఉన్న ద్విచక్రవాహనాల రికార్డులు పరిశీలించారు. సరైన రికార్డులు లేని సుమారు 21 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సరైన రికార్డులు చూపించి తమ వాహనాలను తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ సెర్చ్‌లో ఎస్‌ఐ లక్ష్మి, ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావుతో పాటు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

బాలిగాం రైల్వే గేటును ఢీకొన్న ఆటో


గేటు పైకి లేవకపోవడంతో ప్రయాణికుల పాట్లు

మందస: మందస రైల్వేస్టేషన్(కొత్తకమలాపురం) సమీపంలో గల బాలిగాం రైల్వే గేటును ఓ ఆటో ఢీకొంది. గేటు విరిగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. హరిపురం నుంచి మందస వెళ్తున్న లగేజి ఆటో రైల్వేగేటు ఢీకొనడంతో గేటు ఓ వైపు విరిగిపోయింది. రెండో వైపు పని చేస్తున్నప్పటికీ, విరిగిన గేటు పైకి లేవకపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఇదే ట్రాక్‌లో వెళ్లాల్సిన పూరి-వాకా(అప్)తో పాటు మరో రైలు కూడా సిగ్నల్ లేకపోవడంతో గేటు ముందు ఆగిపోయాయి. పరిస్థితిని గేటుమేన్ పలాస టెక్నికల్ టీం, ఆర్పీఎఫ్ పోలీసులకు వివరించారు. తక్షణమే చేరుకున్న టెక్నికల్ సిబ్బంది గేటును బాగు చేశారు. సంఘటనకు కారణమైన ఆటోను గుర్తించిన డ్రైవర్ టి.బాబ్జీపై ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ మల్లాద్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రట్టికి పోటెత్తిన భక్తజనం

మందస: ఉద్దానంలో వెలసిన వల్లభ నారాయణస్వామి డోలోత్సవానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఈ నెల 20న డోలోత్సవాలు ప్రారంభం కాగా, ఈ నెల 25వ తేదీతో ముగుస్తాయి. బేతాళపురం పంచాయతీ రట్టిలో గల శ్రీవల్లభనారాయణస్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. చివరి రెండు రోజుల దూర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో స్వామిని దర్శించుకుంటారు. పలాస ఆర్టీసీ డిపో యాజమాన్యం భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు నడుపుతోంది. సోమవారంతో ఉత్సవాలు ముగియనుండడంతో ఆదివారం భక్తులు భారీసంఖ్యలో హాజరయ్యారు.

సారాబట్టీలపై దాడులు


సారాబట్టీని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు


సారా తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు


సారాబట్టీలు

గంజాం జిల్లా అస్కాలో వంటసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టారు. 1000 లీటర్ల సారా, 10 వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఆదివారంమధ్యాహ్నం జరిగిన ఈ దాడుల్లో 25 మందిని అరెస్టు చేయడం సంచలనంగా మారింది. – బరంపురం


డబాల్లో ఉన్న బెల్లం ఊట

గంజాయి తరలిస్తున్న కారు బోల్తా


వంతెన వద్ద బోల్తాపడిన కారు


కారులో పట్టుబడిన గంజాయి



కారులో ఉన్న నకిలీ నంబర్ ప్లేట్లు

జయపురం: సబ్ డివిజన్‌లోని కుంద్రా సమితి భుషంగగుడ పంచాయతీ కటల్‌పాదర్ సమీపంలో కొలాబ్ నది వంతెన వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు బోల్తాపడింది. అందులో రూ.22 లక్షల విలువైన 2 క్వింటాళ్ల 22 కేజీల 450 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే కారులో ఉన్న వారు పరారయ్యారు. కారును బయటకు తీసి స్టేషన్‌కు తరలించారు. కారులో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పేరిట నకిలీ నంబర్ ప్లేట్లను సైతం పోలీసులు గుర్తించారు. రాత్రి 10 గంటల సమయంలో బొయిపరిగుడ నుంచి కుంద్రా వైపు వస్తుండగా బొయిపరిగుడ పోలీసులు వెంబడించడంతో నిందితులు తప్పించుకునే ప్రయత్నంలో వేగంగా నడపడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. కుంద్రా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దీపాంజలీ ప్రధాన్ తెలిపారు.

కలిసికట్టుగా పనిచేద్దాం: కాళీరాం మాఝి

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరఫున కాళీరాం మాఝి పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ అధిష్టానం ఆదివారం ప్రకటించింది. పార్టీలో క్రియాశీల సభ్యునిగా పనిచేస్తున్న కాళీరాం ప్రస్తుతం బీజేపీ ఎస్సీ, ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా సేవలు అందిస్తున్నారు. ఇదే స్థానం నుంచి ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థుల జాబితా ఇంతవరకు ప్రకటించలేదు. కాళీరాం మాఝి పేరును ప్రకటించడంతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ మాఝిని అభినందించారు. పార్టీ విజయానికి కలిసికట్టుగా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.


కాళీరాం మాఝి

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ వార్షికోత్సవం


శిక్షణా శిబిరంలో విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిరం ఆవరణలో ఆదివారం శాంతికుంజ్ (హరిద్వార్)దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వార్షిక ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుంజయ కుమార్, ఆదిత్య రంజన్, కన్నయలాల్ దేవాంగన్, స్థానిక విశ్వగాయత్రీ పరివార్ శాఖ కోఆర్డినేటరు సంతోష్ కుమార్ గంతాయత్‌ల సమక్షంలో 150 మంది విద్యార్థులు కర్ర విన్యాసాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రధాన ఆచార్యులు సరోజ్‌కుమార్ పండా, అనాది పాణిగ్రాహి, ఆచార్య దేవీప్రసాద్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ధనుంజయ్‌కుమార్

'రాజ్యసభ' కేటాయింపుల్లో అన్యాయం!

- అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో 14 మంది ఎమ్మెల్యేలు
- ఓటర్లగానే చూస్తున్న పార్టీలు
- తొలిసారి భగవాన్ మజ్జిని రాజ్యసభకు పంపించిన బిజూ పట్నాయక్


నెక్కంటి భాస్కరరావు


మున్నాఖాన్


ఎ.వి.స్వామి


భగవాన్ మజ్జి

2024 సార్వత్రిక సమరం

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాలకు రాజ్యసభ ఎంపీల కేటాయింపులో దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంతం నుంచి 14 మంది ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును రాజ్యసభ ఎన్నికల సమయంలో వినియోగించుకుంటున్నారు. అయినా పార్టీ అధిష్టానాలు మాత్రం వీరిని కేవలం ఓటర్లు గానే చూస్తున్నారు తప్ప ఎంపీల కేటాయింపులు చేయట్లేదు. స్వాతంత్ర్యం వచ్చాక ఈ 75 ఏళ్లలో కొరాపుట్ జిల్లాల నుంచి వందలాది ఎమ్మెల్యేలు రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వినియోగించుకున్నారు. కానీ ఆ స్థాయిలో న్యాయం జరగలేదనే చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ కోసం అత్యధిక ఎమ్మెల్యేలు అనేక సార్లు గెలుపొందినా అధిష్టానం ఏనాడూ ఈ జిల్లాల వైపు ఒక్కసారైనా విదల్చలేదు. ఎమర్జెన్సీ అనంతరం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ వ్యతిరేక పవనాలు వీచినా ఇక్కడ మాత్రం హబిబుల్లాఖాన్ వంటి వారు ఎమ్మెల్యేలుగా గెలుపొందడం విశేషం.

గుర్తించిన బిజూ పట్నాయక్..

కొరాపుట్ జిల్లాల వైపు నుంచి రాజ్యసభ స్థానాలు ఇవ్వడం లేదని బిజూ పట్నాయక్ గుర్తించారు. గిరిజన ప్రాంతం నుంచి రాజ్యసభకు ప్రతినిధిని పంపాలని ప్రకటించారు. తాను జనతాదల్ పార్టీలో ఉండగా 1994లో భగవాన్ మజ్జిని రాజ్యసభకి పంపి చరిత్ర సృష్టించారు. ఎస్‌డీసీ రాష్ట్ర సలహాదారుడు, మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి తండ్రి భగవాన్ మజ్జి జనతాదళ్‌ను బీజూ జనతాదల్‌గా మార్చిన నవీన్ పట్నాయక్ తండ్రి సంప్రదాయాన్ని కొనసాగించారు. 2012లో అలజంగి వెంకట స్వామిని రాజ్యసభకు పంపించారు. నబరంగ్‌పూర్ జిల్లా చైనా మార్కెట్‌కు చెందిన స్వామి ఒడిశాలో తొలి కెమికల్ ఇంజినీర్. బిజూ పిలుపుతో ఒక్క రూపాయి జీతంపై కొరాపుట్ జిల్లాలో వెనుకబడిన బొయిపరిగుడ సమితి బీడీఓగా పని చేశారు. గాంధేయవాది కావడంతో ఖరియర్ ప్రాంతంలో ఆశ్రమం ఏర్పాటు చేసి స్థిరపడ్డారు. తండ్రి బిజూకు స్నేహితుడు కావడంతో నవీన్ స్వతంత్ర అభ్యర్థిగా స్వామిని గెలిపించారు. స్వామి తెలుగువారని, నబరంగ్‌పూర్ వాసి అని చాలా మందికి తెలియదు. అనంతరం తెలుగు ప్రజల తరఫున నిజమైన ప్రతినిధి కావాలని డిమాండ్లు పెరిగాయి. దాంతో నవీన్ 2016లో రాయగడకి చెందిన నెక్కంటి భాస్కరరావును రాజ్యసభకు పంపించారు. మళ్లీ 2020లో నబరంగ్‌పూర్‌కి చెందిన ఒడియా సినీ హీరో మున్నాఖాన్‌ని రాజ్యసభకి పంపించారు. మున్నా దశాబ్దాలుగా నవీన్‌కు స్నేహితుడు. ప్రస్తుతం మున్నా ఒక్కరే కొరాపుట్ జిల్లాల నుంచి రాజ్యసభలో కొనసాగుతున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక సందడి కనిపించింది. స్థానిక జిల్లా నుంచే కాక ఇరుగు పొరుగు జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపు వత్సవలస రాజులమ్మ జాతర సందర్భంగా ఆదివారం వేకువజాము నుంచే భక్తులు కుటుంబాలతో కలిసి వచ్చేయడంతో ముందుగా అరసవల్లి ఆదిత్యుడిని దర్శించుకునేందుకు క్యూలలో బారులు తీరారు. ఇంద్రపుష్కరిణి ఆవరణలో రావి చెట్టు వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేసారు. ఒక్క ఆదివారంలో మొత్తంగా రూ.5,69,584 ఆదాయం లభించింది. ఇందులో వివిధ దర్శనాల మార్గాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,21,800, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.62,784, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.85 లక్షల ఆదాయం లభించినట్లుగా ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తెలియజేశారు.

భక్తితో శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేణ సిరిజ్యోతి పూజలు ఆదివారం జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రానికి దీపాలను వెలిగించి పుజలు నిర్వహించారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు


వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 160 కిలోల బరువు ఎత్తుతున్న ఆవల గోవిందరావు

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో ఆదివారం ఇప్పిలి గణపతిరావు మాస్టారు జ్ఞాపకార్థం జిల్లాస్థాయి బల ప్రదర్శన పోటీలు సందడిగా నిర్వహించారు. త్రినాథస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఏటా ఈ జిల్లాస్థాయి బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. 80 కిలోల విసురుగుండు పోటీలలో ఒప్పంగి గ్రామానికి చెందిన గేదెల సత్యనారాయణ ప్రథమ, ఎస్.రజాక్‌కు ద్వితీయ బహుమతి పొందారు. అలాగే 100 కిలోల సంగిడి పోటీల్లో గేదెల సత్యనారాయణ, ఎస్.రజాక్, ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఆవల గోవిందరావు 160 కిలోలు ఎత్తి ప్రథమ, ఎస్.రజాక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. మహిళల విభాగంలో 100 కిలోలు ఎత్తి సీహెచ్ రాజ్యలక్ష్మి, గుజ్జల వర్షిత ఇద్దరు ఒకే బరువు ఎత్తడంతో ఉమ్మడిగా ప్రథమ బహుమతి అందజేశారు. అలాగే 250 కిలోల ఈడ్పు సంగిడి పోటీల్లో ఆవల గోవిందరావుకు ప్రథమ, ఎస్.రజాక్, ఆవల వసంతలకు ఉమ్మడిగా ద్వితీయ బహుమతి అందజేశారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీలను పీడీ ఈశ్వరరావు, పవర్ వెయిట్ లిఫ్టింగ్ గౌరవ అధ్యక్షుడు బి.తిరుపతిరావు, సూర్యనారాయణల సమక్షంలో నిర్వహించారు. విజేతలకు శివ ప్రియ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, వైఎస్సార్ పార్టీ నాయకులు మెండ రాంబాబు, చిన్నాల వెంకట సత్యనారాయణలు, శివ ప్రియ ట్రస్టు చైర్మన్ రెడ్డి శివన్నారాయణలు బహుమతులు అందించారు.

విభిన్న ప్రతిభావంతులకు బాసట


సమగ్రశిక్ష ప్రాజెక్ట్ కార్యాలయం

- ఉపకరణాల పంపిణీకి సమగ్రశిక్ష చర్యలు
- 26 నుంచి 28వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం పంపిణీ

శ్రీకాకుళం న్యూకాలనీ: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ జిల్లా అధికారులు తీపికబురు అందించారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు (శారీరక వైకల్యం, వినికిడిలోపం, తీవ్రబుద్ధి మాంధ్యత, చలన వైకల్య లోపం) డివిజన్ స్థాయిలో పరీక్షించి ఉపకరణాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర సమగ్ర శిక్ష పథకం ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు ప్రత్యేక అవసరాల పిల్లలకు అవసరమయ్యే ట్రైసైకిల్, వీల్‌చైర్, సీపీ చైర్, రొటేటర్, బీటీఈ(వినికిడి పరికరం, కాలిపర్సు) తదితర ఉపకరణాలను అందజేందుకు పకడ్బందీగా చర్యలు తీసుంటున్నారు.

వసతి, సౌకర్యాలు అందజేత

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు 5 కేంద్రాల్లో పరీక్షలు జరిపి, అనంతరం ఉపకరణాలను అందజేయనున్నారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆయా కేంద్రాలకు సమీపంలోని మండలాల పిల్లలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం జరగనుంది. ఈ మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపునకు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులు/సంరక్షకులకు రవాణా చార్జీలు, టీ, స్నాక్స్, భోజనం, వసతి కల్పించేలా సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ డాక్టర్ ఆర్.జయప్రకాష్ నేతృత్వంలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


శ్రీకాకుళం భవిత కేంద్రం

ఈ పత్రాలు తప్పనిసరి..

ఈ క్యాంప్‌నకు హాజరయ్యే విద్యార్థులు వారి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌కాపీలు, 3 పాస్ ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలి. వారు హాజరుకావాల్సిన కేంద్రం వద్దకు ఆయా తేదీల్లో ఉదయం 9 గంటలకు చేరుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు వారి భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఐఈఆర్పీలను సంప్రదించాలి.

ఐదు కేంద్రాల్లో మూడు రోజుల పాటు..

- 26వ తేదీన శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియం (కోడిరామ్మూర్తి స్టేడియం సమీపం) వేదికగా పరీక్షలు, ఉపకరణాల పంపిణీ జరుగుతుంది. ఇక్కడకు శ్రీకాకుళంతోపాటు గార, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం, పొందూరు, ఆమదాలవలస మండలాలకు చెందిన పిల్లలు హాజరుకావాలి.
- 26వ తేదీన ఎల్ఎన్‌పేట భవిత కేంద్రం(ఎంపీపీఎస్ స్కూల్) వేదికగా జరిగే పరీక్షలు, ఉపకరణాల పంపిణీకి ఎల్ఎన్‌పేటతోపాటు బూర్జ, హిరమండలం, కొత్తూరు, సరుబుజ్జిలి మండలాలకు చెందిన పిల్లలు హాజరుకావాలి.
- 27న నరసన్నపేట (ఎంఆర్‌సీ కేంద్రం) వద్ద జరిగే పరీక్షలు, ఉపకరణాల పంపిణీకి నరసన్నపేటతోపాటు పోలాకి, జలుమూరు, సారవకోట, కోటబొమ్మాళి మండలాలకు చెందిన పిల్లలు హాజరుకావాలి.
- 27న కంచిలి (జెడ్పీహెచ్‌స్కూల్) వేదికగా జరిగే పరీక్షలు,ఉపకరణాల పంపిణీకి కంచిలితోపాటు ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, పలాస మండలాలకు చెందిన పిల్లలు హాజరుకావాలి.
- 28న టెక్కలి భవిత కేంద్రం (తహసీల్దార్ కార్యాలయం సమీపం) వేదికగా జరిగే పరీక్షలు, ఉపకరణాలకు టెక్కలితోపాటు నందిగాం, సంతబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన విద్యార్థులు హాజరుకావాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక అవసరాలగల పిల్లల కోసం వారికి అవసరమైన, ఉపయుక్తమైన ఉపకరణాలను ఈ ఏడాది కూడా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర సమగ్రశిక్ష పీడీ ఆదేశాల మేరకు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంప్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈనెల 26 నుంచి 28 వరకు జిల్లాలో 5 కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలగల పిల్లలకు పరీక్షలు నిర్వహించి, ఉపకరణాల పంపిణీ చేస్తున్నాం. మండలాలవారీగా నిర్దేశించిన వారి కేంద్రానికి చేరుకోవాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ఏపీసీ శ్రీకాకుళం జిల్లా

డోలోత్సవ పుణ్యస్నానం


సముద్ర తీరంలో భక్తులు

గార: శ్రీకూర్మనాథుని డోలోత్సవాల్లో మూడో రోజు ఆదివారం సముద్ర స్నానాలతో భక్తులు పరవశించారు. పడియా సందర్భంగా సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీకూర్మనాథుని సన్నిధిలోని శ్వేతపుష్కరిణిలో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రదానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు వేకువజామున స్వామి వారికి విశేష అర్చనలు జరిపారు. సోమవారం కూడా పుణ్యస్నానాలు ఉంటాయి. అలాగే డోలో మండపంలో స్వామి ఉత్తరాభిముఖంగా భక్తులకు దర్శనమిస్తారు.

క్లుప్తంగా

బెల్లం ఊటలు ధ్వంసం



బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీస్ సిబ్బంది

గుర్ల: మండలంలోని దేవునికణపాక సమీపంలో సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటలను ఎస్సై భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆదివారం ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన బెల్లం ఊట సుమారు 1500 లీటర్లు ఉంటుందని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారీపై సమాచారం ఉంటే ఇవ్వాలని స్థానికులను కోరారు.

కోడి పందాల రాయుళ్ల అరెస్టు



కోడిపందాల రాయుళ్లతో ఎస్సై రాజేష్, సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురంలో వల్లంపూడి పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఐదుగురు కోడిపందాల రాయుళ్లు పట్టుబడడంతో అదుపులోకి తీసుకున్నట్లు వల్లంపూడి ఎస్సై రాజేష్ తెలిపారు. గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ తీర్థమహోత్సవం సందర్భంగా కోడి పందాలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను, మూడు కోడిపుంజులను, ఎనిమిది వందల రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

టీడీపీ అభ్యర్థికి దొరకని మద్దతు

- మండలస్థాయి సమావేశానికి పార్టీ నాయకుల డుమ్మా



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ అభ్యర్థి శ్రీనివాస్

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రతిపక్ష టీడీపీకి తలనొప్పులు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి.బొండపల్లి మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం మండల సముదాయం వద్ద టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడుతో పాటు, పార్టీ రాష్ట్ర నాయకుడు కరణం శివరామ కృష్ణకు చెందిన రెండు వర్గాల ముఖ్య నాయకులు హాజరు కాలేదు. పార్టీకి మండలంలో పెద్ద దిక్కుగా ఉన్న ముఖ్య నాయకులు ఎవరూ కార్యక్రమానికి హాజరు కాలేదు. మాజీ జెడ్పీటీసీ బండారు బాలాజీతో పాటు పార్టీ మండల అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న కోరాడ కృష్ణ, మరో కీలక నేత ఏఎంసీ మాజీ ఛైర్మన్ బి.చంటిరాజుతో పాటు, నియోజకవర్గ తొలి టీడీపీ ఎమ్మెల్యే జేఎస్ఎన్.రాజుకు చెందిన కుటుంబసభ్యులు, వారసులు కూడా సమావేశానికి హాజరు కాలేదు.అయితే మండలవ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వాహనాల్లో పెద్ద ఎత్తున ప్రజలను తరలించే ఏర్పాట్లు నాయకులు చేశారు. అక్కడ భోజనాలు కూడా ఏర్పాటు చేయడంతో గందరగోళం ఏర్పడింది. ఒక వైపు ముఖ్య నాయకులు ప్రసంగాలు జరుగుతుండగానే భోజనాలు కౌంటర్ల వద్ద బారులు తీరారు. భోజనాల కోసం పెద్ద సంఖ్యలో రావడంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఇక మండలంలోని టీడీపీ ప్రధాన నాయకులంతా ఈనెల 27 వతేదీన బుధవారం సమావేశం నిర్వహించాలని అప్పుడు అందరం వస్తామని చెప్పినప్పటికీ అభ్యర్థి శ్రీనివాస్ ఆదివారం సమావేశం నిర్వహించారనే ప్రచారం జరుగుతోంది.

గవరమ్మపేటలో గజరాజుల గుంపు



భామిని: తాలాడ వైపు నడుస్తున్న గజరాజుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, వెంకటరాజపురం మధ్యనున్న పంట పొలాల్లో గజరాజుల గుంపు ఉంది. ఆదివారం మధ్యాహ్నం జొన్న పంటలో ఉన్న ఏనుగులు సాయంత్రానికి అరటి, వరి చేలలో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పంట చేలలోకి గజరాజులు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తాలాడ వైపు...

భామిని: మండలంలోని తాలాడ వైపు నాలుగు ఏనుగుల గుంపు పయనించింది. ఆదివారం ఘనసర సమీపంలో తోటల నుంచి తాలాడ ఐలమ్మ తోటలకు తరలివెళ్లాయి. ఫారెస్ట్ బీట్ అధికారి లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఎలిఫెంట్ ట్రాకర్స్ ఏనుగుల గుంపు ప్రయాణాన్ని గ్రామస్తులకు తెలిపారు. తాలాడలో గతంలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు మళ్లీ వేసవి సమయంలో చేరుకొనడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

- 80 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- 1,031 పోలింగ్ కేంద్రాలు
- 7,75,598 మంది ఓటర్లు
- శాంతిభద్రతలపై పటిష్ట చర్యలు
- అందుబాటులో కంట్రోల్ రూమ్
- 10 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల ఏర్పాటు



ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సమావేశంలో కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురంటౌన్: స్వేచ్ఛాయుత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ నిర్వహించేలా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ చర్యలు చేపట్టారు. ఈ మేరకు జిల్లాలో ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపట్టారు. అభ్యర్థి నామినేషన్ వేసిన నాటి నుంచి వారి ఖాతాల్లో ఖర్చు జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ.90 లక్షల వరకు మాత్రమే ఖర్చు చేయాలన్నది నిబంధన. వాట్సాప్ తరహాలో ''సీ విజిల్'' యాప్ ద్వారా ఎవరైనా సమస్యను తెలియజేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పటిష్టమైన నిఘా పెట్టారు. బైండోవర్ కేసులు నమోదు చేసి, సరిహద్దు ఒడిశా రాష్ట్ర చెక్ పోస్టలతోపాటు జిల్లాలోని చెక్ పోస్ట్‌లను మరింత పటిష్ఠం చేసేలా ఎస్పీ విక్రాంత్ పాటిల్ చర్యలు చేపట్టారు. జిల్లాలో మొత్తం 1,031 పోలింగ్ కేంద్రాల్లో పని చేయడానికి సిబ్బందిని ఏర్పాటు చేశారు.

మార్చి 16 నాటికి జిల్లాలో ఓటర్ల వివరాలు

జిల్లాలో ఈ నెల 16వ తేదీ నాటికి 7,75,598 మంది ఓటర్లు నమోదయ్యారని కలెక్టర్ నిషాంత్‌కుమార్ వెల్లడించారు. అందులో పురుషులు 3,78,764 మంది, స్త్రీలు 3,96,766 మంది, ట్రాన్స్ జెండర్లు 68 మంది ఉన్నట్లు చెప్పారు. అత్యధికంగా సాలూరు (ఎస్టీ) నియోజకవర్గంలో 2,01,441 మంది, అత్యల్పంగా పార్వతీపురం (ఎస్టీ) 1,87,854 మంది, పాలకొండ (ఎస్టీ) 1,93,667 మంది, కురుపాం (ఎస్టీ) నియోజకవర్గంలో 1,92,636 ఉన్నట్లు గతంలో ఆయన వివరించారు.

సిద్ధంగా పోలీస్ యంత్రాంగం

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉంది. సుమారు 3800 మంది సిబ్బంది అవసరం కాగా ఇప్పటి వరకు 800 మంది అందుబాటులో ఉన్నారు. జిల్లాకు 3 కంపెనీల కేంద్ర బలగాలు చేరుకున్నాయి. మరో 17 కంపెనీల బలగాల అవసరం ఉండడంతో జిల్లాకు తీసుకువచ్చే చర్యలు చేపట్టారు. జిల్లాలో 80 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 80 పోటింగ్ లోకేషన్ల పరిధిలోని మండలాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. గతంలో ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని బైండోవర్ చేసి, వెపన్స్ స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా 10 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

జిల్లాలో నలుగురు ఎన్నికల అధికారులు

జిల్లా పరిధిలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి నలుగురు ఆర్వోలను నియమించారు. పార్వతీపురం ఎన్నికల అధికారిగా ఆర్డీఓ హేమలత, సాలూరుకు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, పాలకొండ సాలూరు ఎన్నికల అధికారిగా సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి, కురుపాం ఎన్నికల అధికారిగా ఆర్డీఓ వీవీ రమణలు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు.



కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

అందుబాటులో కంట్రోల్ రూమ్

సాధారణ ఎన్నికల దృష్ట్యా కలెక్టర్ కార్యాలయంలోను, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలోను కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో 08963-796126, 293046, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కార్యాలయం 8977519101 నంబర్లను అందుబాటులో ఉంచారు.

సాగు నీటి కాలువ కప్పేసి రోడ్డు

- టీడీపీ నేత బరితెగింపు
- ఫిర్యాదు చేసిన పట్టించుకోని రెవెన్యూ అధికారులు



సిరిపురం రెవెన్యూ పరిధిలో సాగునీటి కాలువ కప్పేసి వేసిన రోడ్డు

గంట్యాడ: గతంలోఅధికార మదంతో ఓ టీడీపీనేత రెచ్చిపోయాడు. అధికారం ఉంది కదాని ఏకంగా పోరంబోకు వాగు (సాగునీటి కాలువ)ను కప్పేసి తన సొంత పొలానికి వెళ్లడానికి రోడ్డు వేసేశాడు. దీనిపై అప్పట్లో రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఆ నేత అధికార పార్టీకి చెందిన వాడు అధికారులు మిన్నకుండి పోయారు. టీడీపీ నేత అక్రమంగా రోడ్డు వేయడం వల్ల సాగునీటి కాలువ ద్వారా చెరువులోకి వెళ్లాల్సిన నీరు వెళ్లడం లేదు. టీడీపీ నేత బరితెగించి ప్రభుత్వ సాగునీటి కాలువలో రోడ్డు వేసినప్పటికీ అప్పట్లో రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సిరిపురం రెవెన్యూ పరిధిలో ఘటన

గంట్యాడ మండలంలోని సిరిపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 108-1 లో సాగునీటి కాలువ ఉంది. ఈ కాలువ గుండా కంసాల చెరువులోకి వర్షాలు పడినప్పుడు మెట్టభూముల నుంచి వచ్చే నీరు వెళ్లేది. 2015-16 మధ్య కాలంలో టీడీపీకి చెందిన కీలక నేత ఒకరు ఈ కాలువను కప్పేసి రోడ్డు వేశారు. అక్రమంగా రోడ్డు వేస్తున్నారని, అడ్డుకోవాలని అప్పట్లో రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే రోడ్డు వేసింది ప్రభుత్వ భూమి అయినప్పటికీ అధికారులు చర్య తీసుకోక పోవడం సర్వత్రా చర్చనీయంశమైంది.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లా

సాగునీటి కాలువపై రోడ్డు వేసిన సమయంలో నేను లేను. పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాను.

శ్రీనివాస్, వీఆర్వో, సిరిపురం

ముగ్గురిపై కులదూషణ కేసు నమోదు

బలిజిపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ప్రభాకర్‌ను కొట్టి, కులదూ షణ చేసిన ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. పదవ తరగతి పరీక్షా కేంద్రం వద్ద కానిస్టేబుల్ ప్రభాకర్ శనివారం పరీక్ష ప్రారంభంలో అందరినీ బయటకు పంపించారు. అదే సమయంలో ఉన్నత పాఠశాలకు చెందిన సబ్జెక్టు ఉపాధ్యాయులు లోపల ఉండగా వారిని ఇన్విజిలేటర్లుగా భావించి మిగిలిన వారిని పంపించారు. దీనిపై బి.జగన్, ఎ.వెంకటరమణ, వి.శంకరరావులు కానిస్టేబుల్‌ను అడగ్గా వారిమధ్య వాగ్వాదం జరిగింది. అదేసమయంలో కానిస్టేబుల్‌ను వారు చెంపపై కొట్టి, కులదూషణ చేసినట్లు ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు. జగన్, వెంకటరమణలు కానిస్టేబుల్ ప్రభాకర్‌ను కర్రతో కొట్టి, భయభ్రాంతులకు గురిచేసినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసినట్లు ఎస్సై పాపారావు తెలిపారు. దీంతో పాటు పరీక్షా కేంద్రంలో ఉపాధ్యాయులు కొంతమంది పిల్లలకు స్లిప్పులు అందించి అవకతవకలకు పాల్పడుతున్నట్టు తల్లితండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. దీనిని లోపల ఉండే అధికారులు సరిదిద్దాల్సి ఉందన్నారు. వారి దృష్టిలో ఈ విషయం ఉంచడం జరిగిందని తెలిపారు.

మహిళను గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామానికి రౌతు రామలక్ష్మిని అదే గ్రామానికి చెందిన రౌతు సురేష్ గాయపర్చిన ఘటనకు సంబంధించి కేసు నమోదుచేశామని సీఐ డి.మోహనరావు ఆదివారం తెలిపారు. రామలక్ష్మి భర్త భుజంగరావు కళ్లం వద్ద ఉండగా పక్క స్థలానికి చెంది రమేష్ అక్కడికి వచ్చి భుజంగరావుతో గొడవ పడుతున్నాడు. ఆ సమయంలో రామలక్ష్మి అడ్డుపడడంతో ఆమె తలపై గజంముక్కతో సురేష్ కొట్టాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని సీఐ తెలిపారు. అలాగే మండల పరిధి గురవాం గ్రామానికి చెందిన రెడ్డి ప్రవల్లిక, తొత్తరి కల్యాణి కుటుంబీకుల మధ్య జరిగిన గొడవకు సంబంధించి పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు.

హిందీ పరీక్షా ఫలితాల వెల్లడి

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ మద్రాస్ నిర్వహించిన హిందీ పరీక్షల ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయని హిందీ ప్రచారక్ కె.మధుసూధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ వరకూ గల ఈ పరీక్షలు ఫిబ్రవరిలో జరిగాయని, ఫలితాల నిమిత్తం ఫోన్ నంబర్ 9949917365ను సంప్రదించాలని సూచించారు.

సులభంగా చేపల వేట



- సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న మత్స్యకారులు
- జీపీఎస్, ఎకోసౌండ్ సిస్టం వినియోగం

పూసపాటిరేగ: సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న మత్స్యకారులు ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేస్తున్నారు. భారీ వలలతో సాగర మథనం చేసినా చేపలు చిక్కక ఉసూరుమంటూ వెనుదిరిగే పరిస్థితుల నుంచి బయట పడుతున్నారు. సాంకేతికతతో సులభంగా చేపలను ఒడిసి పడుతున్నారు. కెమెరాలు, జీపీఎస్, ఎకో సౌండ్ సిస్టమ్ ఉపయోగిస్తూ సముద్ర గర్భంలోని మత్స్య సంపదను వెలికితీస్తున్నారు. విజయనగరం జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల పరిధిలో 27 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. తీరం వెంబడి 19 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వారిలో సుమారు 10 వేల మందికి చేపల వేటే జీవనాధారం. రెండు మండలాల పరిధిలో 150 సంప్రదాయ బోట్లు, 450 వరకు ఇంజిన్ బోట్ల సహాయంతో మత్స్యకారులు వేట సాగిస్తున్నారు.

సాంకేతికత వినియోగం

ప్రస్తుతం పెద్ద బోట్లు, కొన్ని పడవల్లో జీపీఎస్, ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్ ఉపయోగించి మత్స్యకారులు చేపలవేట సాగిస్తున్నారు. ఇందులో భాగంగా బోటు కింద కెమెరాలు అమరుస్తున్నారు. బోటు లోపల కెమెరా అనుసంధానంతో చిన్న స్క్రీన్‌తో కూడిన కంప్యూటర్ లాంటి పరికరాలు పెడతారు. ఆ బోటు సముద్రంలో బాగా లోపలకు వెళ్లాక ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్‌ను ఆన్‌చేస్తారు. సముద్రం లోతు, చేపల చలనం ఫిష్ ఫైండర్ పరికరంలో కనిపిస్తుంది. చేపలు గుంపుగా వచ్చినప్పుడు అవి అనుకూలంగా తమకు దొరికేలా శబ్ద తరంగాలు విడుదల చేస్తాయి. వాటి వల్ల చేపలు రివర్స్‌లో వస్తాయి. ఆ చేపలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో చూసి వల విసురుతారు. దీంతో చేపల వలకు సులభంగా చిక్కుతాయి.

సాంకేతికత వైపు అడుగులు

ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్ ద్వారా చేపలు పట్టే విధానం సులభంగా ఉంటుంది. తమిళనాడు, గుజరాత్, ఏపీలో ఎక్కువ మంది దీన్ని ఉపయోగిస్తున్నారు. సాంకేతికత వైపు మత్స్యకారులు అడుగులు వేసే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. సాంకేతికతతో వేట సాగడంతో మత్స్యకారులు అభివృద్ధి చెందుతున్నారు.

చాందిని,
మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, విజయనగరం

నేడు రంగుల హోలీ

- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య పండగ



విక్రయానికి సిద్ధంగా ఉన్న రంగులు

విజయనగరం: ఫాల్గుణ మాస పౌర్ణమి. లేలేత చిగుళ్లు, విరబూసిన పూరెమ్మలు, చెట్లు వసంత రాగం ఆలపిస్తున్న తరుణంలో వయోబేధానికి అతీతంగా ఆనందోత్సాహలతో జరుపుకునే పండగ హోలి. పురాణ ప్రాశస్త్యం కలిగిన ఈ పండగను అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు పులుముకుంటూ ఆనంద సాగరంలో మునిగితేలుతారు. దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకునే పండగను విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాలకు చెందిన ప్రజలు ఇష్టంగా జరుపుకోవడం కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది.

ఆనందంతో పాటు ఆరోగ్యం..

ఒకప్పుడు పూలు, పండ్ల ద్వారా వచ్చిన రంగులనే హోలీ వేడుకల్లో వాడేవారు. పండగకు ఒక రోజు ముందు అడవికి వెళ్లి మోదుగపూలు సేకరించేవారు. వాటిని ఉడికించగా వచ్చే ఎర్రని ద్రావణంలో పసుపు, కుంకుమ కలిపి ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సంబరాలు చేసుకునేవారు. కాలక్రమేణా వార్నిష్, సింథటిక్ రంగులను చల్లుకుంటున్నారు. అయితే హోలీ ఆడడంలో జాగ్రత్తలు తీసుకోక తప్పదని చర్మవ్యాధుల నిపుణులు హెచ్చరిస్తున్నారు. రసాయనాలతో మిళితమైన రంగులు కాకుండా సహజసిద్ధమైన రంగులతో హోలీ జరుపుకోవడం ద్వారా చర్మానికి హాని జరగకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.



హోలీ పండగ జరుపుకుంటున్న దృశ్యం (ఫైల్)

ఈ సూచనలు పాటిస్తే మేలు....

- రసాయన రంగులైన లెడ్ ఆక్సైడ్, అల్యూమినియం, బ్రోమెడ్, మెర్క్యూరీ సల్ఫేట్ వంటివి వినియోగిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. అవి కళ్లల్లో పడితే కంటిచూపు పోయే ప్రమాదం ఉంది.
- గులాల్ వంటివి వినియోగిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. ఈ రంగులతో ఆస్తమా, చర్మ సంబంధిత వ్యాధులు ఉత్పన్నమవుతాయి.
- రసాయనాలు కలిసిన రంగులతో హోలీ ఆడితే వాటిని శరీరంపై ఎక్కువ సమయం ఉండనీయకూడదు. వెంటనే చల్లని నీటితో శరీరాన్ని శుభ్రం చేసుకోవాలి.
- ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకునేందుకు సబ్బుకన్నా క్లెన్సింగ్ మిల్క్ ఉత్తమమైనది.
- చాలా మంది రంగుల్లో వివిధ రకాల ఆయిల్స్ కలుపుతారు. ఆ కారణంగా రంగులను శుభ్రం చేసుకునేందుకు నీరు ఎక్కువగా అవసరమవుతుంది. అందుకే రంగుల్లో ఎటువంటి ఆయిల్స్ లేదా నీటిని కలపకుండా హోలీ ఆడడం ద్వారా నీటి వృథాను అరికట్టవచ్చు.

సంప్రదాయ రంగులే ఉత్తమం:

దేశ వ్యాప్తంగా జరుపుకునే హోలీ పండగను సంప్రదాయ రంగులతో చేసుకోవడం ఉత్తమం. ముఖ్యంగా చిన్న పిల్లలను రంగుల పండగకు దూరంగా ఉంచాలి. చాలా మంది రసాయనాలతో తయారు చేసే రంగులను వాడుతుంటారు. వాటి కారణంగా చర్మవాధులు, కంటి సంబంధిత ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. జాగ్రత్తగా పండగను జరుపుకుంటే అందరూ సంతోషంగా ఉంటారు.

– శ్రీనివాసరావు, చిన్న పిల్లల వైద్యనిపుణుడు

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి



సంఘటనా స్థలంలో మృతదేహం (ఇన్‌సెట్లో) భాస్కరరరావు(ఫైల్)

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ఐటీ సమీపంలో శనివారం అర్ధరాత్రి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో సంతకవిటి మండలంలోని అక్కరాపల్లి గ్రామానికి చెందిన నారాయణశెట్టి భాస్కరరావు (35) అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. భాస్కరరావు, పెదనాన్న కుమారుడు పార్వతీశం బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. దీంతో జరిగిన ప్రమాదంలో భాస్కరరరావు మృతిచెండగా బైక్‌పై వెనుక కూర్చున్న పార్వతీశానికి తీవ్ర గాయాలయ్యాయి. ఎదురుగా వచ్చి ఢీకొన్న మరో వాహనచోదకుడు రేగిడి మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన శ్రీను కూడా గాయాలపాలయ్యాడు. ప్రమాదం జరిగిన సమీపంలోని కొంతమంది వ్యక్తులు 108 వాహనానికి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించారు. పట్టణ ఎస్సై రవికిరణ్ సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించి కేసు నమోదుచేశారు. మృతుడు భాస్కరరావుకు భార్య నాగమణితో పాటు కుమారుడు ఉన్నాడు.

బైక్ ఢీకొని వ్యక్తి..



బొండపల్లి: మృతి చెందిన గౌరినాయుడు

బొండపల్లి: మండలంలోని జీపీ అగ్రహరం గ్రామానికి చెందిన వ్యక్తి బహిర్భుమికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నమ్మి గౌరినాయుడు(50) ఆదివారం వేకువ జామున బహిర్భూమికి వెళ్తుండగా ఇదే మండలంలోని రెల్లిపేటకు చెందిన వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తూ వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో జరిగిన ప్రమాదంలో తల వెనుక గాయం కాగా గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడితో ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108కు సమాచారం ఇవ్వగా వాహనం రాకముందే మృతిచెందాడు. మృతుని భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నాగావళి కాలువలో పడి వ్యక్తి..



జియ్యమ్మవలస: గోపాల్ శ్రీనివాసరావు మృతదేహం

జియ్యమ్మవలస: మండలంలోని తురకనాయుడువలస గ్రామానికి చెందిన పుచ్చ గోపాల్ శ్రీనివాస రావు (44) ప్రమాదవశాత్తు తోటపల్లి ఎడమ కాలువలో జారిపడి మృతిచెందాడు. ఈ మేరకు ఎస్సై అనీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపాల్ శ్రీనివాస రావు శనివారం పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతుకుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇటిక గదబవలస వద్ద ఆదివారం ఉదయం ఓ మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీసి తురకనాయుడువలస గ్రామానికి చెందిన గోపాల్ శ్రీనివాసరావుగా గుర్తించారు. ఈ మేరకు బంధువులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి వచ్చి భోరున విలపించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనీష్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉండగా ఒకరికి పెళ్లైంది.

క్షయ వ్యాధి రహిత జిల్లా లక్ష్యం

- డీఎంహెచ్ఓ డా. జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: క్షయ వ్యాధి రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.బి.జగన్నాథరావు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని ఆదివారం ఎన్‌జీఓ హోంలో నిర్వహించారు. క్షయ వ్యాధిని గుర్తించిన రాక్ చిత్ర పటానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ అంటు వ్యాధి లక్షణాలు ఉన్న వారు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా కఫం పరీక్షలు, ఎక్స్ రే, సిబినాట్, ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలకు సరిపడే ఖరీదైన మందులు ఉచితంగా అందించడం జరుగుతుందని చెప్పారు. ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులు వాడకపోతే మొండి క్షయగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం 21 నెలల పాటు రూ.2 లక్షల విలువ చేసే మందులు ఉచితంగా అందిస్తుందని ఆయన వివరించారు. ప్రజల్లో వ్యాధి లక్షణాలు విస్తృతంగా తెలియజేయాలని ఆయన సూచించారు. జిల్లాలో 43 డిజిగ్నేటెడ్ మైక్రోస్కోప్ సెంటర్లు, 7 టీబీ యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేంద్రాల్లో 2023 జనవరి నుంచి డిసెంబరు వరకు 1818 మందికి క్షయ పాజిటివ్‌గా గుర్తించడం జరిగిందన్నారు. అందులో 911 మందికి చికిత్స పూర్తి చేయడం జరిగిందన్నారు. జనవరి 2024 నుండి ఇప్పటి వరకు 230 మందిని గుర్తించి వారికి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. 98.3శాతం మందికి క్షయ వ్యాధి నుండి విముక్తి పొందారని తెలిపారు. జిల్లాలో 16 పంచాయితీలు క్షయ రహిత పంచాయతీలుగా ఎంపిక చేయడం జరిగిందని ఆయన చెప్పారు. క్షయ వ్యాధి మందులు తీసుకుంటున్న వారికి నెలకు రూ .500లు చొప్పున ఆరు నెలలకు మొత్తం మూడు వేలు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సరైన అవగాహన కల్పించాలని తద్వారా సామాజిక, మానసిక, ఆర్థిక ఒత్తిడి నుండి దూరం చేయవచ్చని తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. వై.వివేక్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది బాగా పనిచేయడం వల్ల క్షయ వ్యాధి కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని అన్నారు. ఈ సందర్భంగా క్షయ అవగాహన కరపత్రాన్ని విడుదల చేశారు. మంచి సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. క్షయ వ్యాధి విజేతలకు బహుమతులు అందజేశారు. డీఎంహెచ్ఓ డా.జగన్నాథరావుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. వివేక్ సత్కరించారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డా.బి.జగన్నాథరావు